నేడు సిపిఎం ప్రజా సంఘాల కార్యాలయం ప్రారంభం

టి.నర్సాపురం : స్థానిక పాత పెట్రోల్ బంకు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సిపిఎం ప్రజాసంఘాల కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు సిపిఎం మండల నాయకులు గుడెల్లి వెంకట్రావు ఆదివారం తెలిపారు. ఈ కార్యాలయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి చేతుల మీదుగా మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.నాగమణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.రాణి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పోచమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ పాల్గొంటారని తెలిపారు.

కేంద్రంలోని మోడీ సర్కార్ అన్నదాతకు కునుకులేకుండా చేస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచేస్తూ అదనంగా పెట్టుబడి భారం నెత్తిమీద వేసింది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ ఢిల్లీ సరిహద్దులో రైతులు ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎరువుల నుంచి డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదల రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో అందరికీ అన్నంపెట్టే రైతన్న ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితి దాపురించింది. కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపుతో జిల్లా రైతాంగంపై అదనపు పెట్టుబడి భారం పడి నలిగిపోతున్న పరిస్థితి నెలకొంది.

అన్నదాతపై.. ఎరువుల పిడుగు..!

- కాంప్లెక్స్ ధరలు భారీగా పెరుగుదల
- 28.28.0 కాంప్లెక్స్ ఎరువుల ధర రూ.1700పైనే
- అదేబాటలో ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- రెండు జిల్లాల రైతాంగంపై తీవ్ర భారం
- రబీలో దాదాపు లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల వినియోగం
- ఎకరాకు రూ. 3 బస్తాల ఎరువులు తప్పనిసరి
- భారీగా పెట్టుబడి పెరుగుదల.. పండిన పంటలకు గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుత రబీ సీజన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. పామాయిల్, మామిడి వంటి ఇతర పంటలు పెద్ద ఎత్తున రైతులు సాగుచేస్తున్నారు. రెండు జిల్లాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కేంద్రంలోని మోడీ సర్కార్ రైతులను చిన్నచూపు చూస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగినప్పటికీ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి నెలకొంది. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెరగడంతో రబీసాగులో రైతులపై పెనుభారం పడింది. వరిసాగులో రైతులకు ఎకరాకు ఐదు నుంచి ఆరు బస్తాల ఎరువు ఉపయోగిస్తారు. ఇందులో మూడు బస్తాలు కాంప్లెక్స్ ఎరువు ఉంటుంది. ఏలూరు జిల్లాలో రబీలో 90 వేల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 62 వేల మెట్రిక్ టన్నుల వరకూ కాంప్లెక్స్ ఎరువులు ఉపయోగించనున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రైతులు ఎక్కువగా 28.28.0, 10.26.26, 12.32.16 వంటి కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగిస్తారు. మొన్నటి వరకూ వీటి ధరలు 50 కిలోల బస్తా ధర రూ.1,470 వరకూ ఉండగా ఇప్పుడే ఏకంగా రూ.1,720కు చేరుకున్నాయి. బస్తాకు దాదాపు రూ.300 ధర పెరిగిపోయింది. ఇప్పటికే సబ్సిడీ పెద్ద ఎత్తున ఇస్తున్నామంటూ పెరిగిన ధరలను రైతులపైకి నెట్టేసిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎకరాకు మరో రూ.వెయ్యి వరకూ అదనంగా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రైతులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. వరిసాగులో ఆరునెలల కష్టపడినా ఎకరాకు రూ.ఐదు నుంచి రూ.ఆరు వేలు కూడా మిగలని పరిస్థితి. అదీ కూడా ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలూ సంభవించకుండా ఉంటే మాత్రమే. జిల్లాను ఏటా పెద్దఎత్తున తుపాన్లు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ పంట సక్రమంగా చేతికి అందడం లేదు. గడిచిన ఖరీఫ్‌లోనూ భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎరువుల ధరలు పెరుగుదలతోపాటు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల రైతులకు భారంగా మారింది. డీజిల్ ధర పెంపుతో దుక్కుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతంలో సాలుకు రూ.వెయ్యి ఉంటే, ఇప్పుడు అది రెట్టింపు దాటిపోయింది. ఇలా రైతులపై ప్రభుత్వం పెనుభారాలు మోపడంతో వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేస్తోంది. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితి నెలకొంది.

గిట్టుబాటు ధర అమలుకు మాత్రం ససేమీరా..

వ్యవసాయ పెట్టుబడులు ఏటా పెరుగుతూనే ఉంటున్నాయి. అందుకు తగిన విధంగా పంటలకు ధర రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని ఢిల్లీ సరిహద్దులో రైతులు గత కొన్నేళ్లుగా ఎడతెరిపి లేని పోరాటం చేస్తున్నారు. మోడీ సర్కార్ ముందుకు రావడం లేదు. గిట్టుబాటు ధరపై చట్టం చేసేందుకు మోడీ సర్కార్ వ్యవహరిస్తున్న తీరే రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం చేసినప్పుడు రైతులకు మేలు జరుగుతోంది. లేకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకొచ్చే పరిస్థితి లేకుండా పోతుంది.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవంలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారవుతాయని, కార్మిక కర్షక ఐక్యతతో పోరాటాలు ఉధృతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవంలో భాగంగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 1982 నుంచి కార్మిక, కర్షక హక్కుల కోసం ఐక్యత దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాడు కార్మికులు, రైతులు తమ హక్కుల కోసం జరిపిన పోరాటాల్లో అనేక మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు అమరులయ్యారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకూ పాలకులు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ కార్మిక, రైతాంగ హక్కులను హరించివేస్తోందని చెప్పారు. ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి కార్మిక కోడ్‌ల పేరుతో 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా మార్చి నిర్బంధ శ్రమ దోపిడీకి పూనుకోవాలని చూస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను పూర్తిగా కాలరాస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, జిల్లా నాయకులు ఎం.ఇస్సాక్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు మాట్లాడుతూ మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూసిందని, పూర్తిగా మార్కెట్‌ను ప్రయివేటుపరం చేయబోతున్నారని, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించి వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించి డబ్బులు వసూలు చేయాలని చూస్తోందని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తివేయాలని కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అభివాదం చేస్తున్న నేతలు

అమిత్ షా గో బ్యాక్

వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఏలూరులోని సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరు శ్రీమన్నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, సిపిఎం నాయకులు పిచ్చుక ఆదిశేషు, ఎ.శ్యామలారాణి, ఎం.రామాంజనేయులు, ఎస్.సత్యనారాయణ, ఏసుబాబు, మీసాల సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఈమని మల్లిక, కాకి నాని, మహర్షి, జి.రాంబాబు, నాగేశ్వరరావు, అప్పారావు, త్రినాధ్, రవణ, అన్నవరం, విష్ణు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :పార్లమెంట్‌లో బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన హోం మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్ పర్యటనను నిరసిస్తూ ఆదివారం చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి హనుమాన్లు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని, అమిత్ షా భారత ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.సుభాష్‌చంద్రబోస్, సిపిఎం నాయకులు పాపారావు, మరియదాసు, రాంబాబు, సీమోను, శ్రీనివాస్, సంసోను, గోపీ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో..

జీలుగుమిల్లి : పార్లమెంటులో బిఆర్.అంబేద్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జీలుగుమిల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, కొండలరావు, అప్పారావు, శేషగిరి, జగదీష్ పాల్గొన్నారు.

ముసునూరు : స్థానిక మండపం సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ అంబేద్కర్ గురించి పార్లమెంటు స్థాయిలో అవమానకరంగా మాట్లాడడం ఘోరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, కంచర్ల పోతురాజు, కంచర్ల దుర్గారావు, కంచర్ల రంగారావు, మానికల ఐతంరాజు, పిల్లి మురళీ, గంగుల సత్యం, కె.కుటుంబరావు పాల్గొన్నారు.

నూజివీడులో...

నిడమర్రు : సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆడవికొలను, చాణమిల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి గ్రామాల్లో అంబేద్కర్ సెంటర్లలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేయాలని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా రాజీనామా చేసే వరకు గ్రామాల్లో పోరాటాలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, నాయకులు గవర సత్యనారాయణ, వెలగల్లేటి మోహన, దళిత సంఘం నాయకులు గోపే మోసెను, అద్దంకి ప్రభాకరరావు, మిర్యాల అంజి, ఉప్పర్తి సామియేలు, ఇప్పిలి ఏడుకొండలు పాల్గొన్నారు.

నిడమర్రులో...

వేమన శతకం.. సామాజిక వికాసం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

కలెక్టరేట్‌లో ఘనంగా యోగివేమన జయంతి

ప్రజాశక్తి - ఏలూరు

తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో శతకాల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన ప్రజాకవి యోగివేమన అని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగివేమన చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాల సందేశాలను నేటి యువతతోపాటు భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వేమన శతకంలో ఒకో పద్యానికి ఒకో ప్రత్యేకత ఉందన్నారు. వాటిలో కొన్నింటినైనా నేర్చుకుంటే అవి మన వికాసానికి తోడ్పడుతుందన్నారు. ప్రతి పద్యంలో మన జీవితాల్లో దాగున్న సత్యాలు కనిపిస్తాయన్నారు. కలెక్టర్ వేమన శతకంలోని "ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికినా నలుపు నపుపేగానీ తెలుపురాదు.. కొయ్యబొమ్మతెచ్చి కొట్టినా పలుకునా విశ్వధాభిరామ వినురమేమ" పద్యాన్ని చెప్పి దాని తాత్పర్యాన్ని కూడా వివరించి అందరినీ అబ్బురపరిచారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ వేమన శతకం లోని "అనుగానిచోట నదికులమనరాదు కొంచెముండుటెల్ల కొదువుగాదు..కొండ అద్దమందు కొంచమైయుండదా విశ్వధాభిరామ వినురమేమ" పద్యాన్ని వినిపిచి తాత్పర్యాన్ని వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విశ్వధాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగువాడు ఉండడన్నారు. పలువురు అధికారులు వేమన శతకంలోని పద్యాలను వాటి తాత్పర్యాలను వివరించగా కలెక్టర్ ఎంతో ఆసక్తితో ఆలకించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, పశు సంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జెడి గోవిందరాజులు, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎంఎం.రాజు, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్‌వి.నాగరాణి, ఐసిడిఎస్ పీడీ శారద, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, పర్యాటక శాఖ మేనేజర్ పట్టాభి, తదితరులు పాల్గొన్నారు.

రబీ ధాన్యంపై.. ఫిబ్రవరిలో ప్రణాళిక..!

- ఖరీఫ్ ధాన్యం 3.35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- మరో పదివేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి
- ధాన్యం సొమ్ములు 48 గంటల్లోపే జమ
- రైతులకు 2,500 టార్పిన్లు అందజేతతో ఎంతో ప్రయోజనం
- 'ముఖాముఖి'లో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు దాదాపు పూర్తయ్యిందని, రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసే పని జరుగుతోందని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి తెలిపారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సజావుగా సాగడానికి తీసుకున్న చర్యలు ఏంటి? ధాన్యం సొమ్ములు జమ, సంచులు అందజేత, రవాణా ఏర్పాట్లలో ఏవిధంగా ముందుకు సాగారు. తేమశాతం ఇబ్బందులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు.. ఇంకా ఎంతమేర ధాన్యం రైతుల వద్ద ఉంది. అదనంగా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందా వంటి పలు ప్రశ్నలకు 'ప్రజాశక్తి' జరిపిన ముఖాముఖిలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి వివరించారు.

ప్రశ్న : ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లక్ష్యం ఎంత? ఇప్పటి వరకూ ఎంత కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ముల జమ ఎంతమేరకు పూర్తయ్యింది?

డిఎం : ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లక్ష్యం 3.40 లక్షల మెట్రిక్ టన్నులు. ఇప్పటివరకూ 3.35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ధాన్యం సొమ్ము రూ.700.80 కోట్లు రైతుల ఖాతాల్లో జమైంది. ఇంకా కేవలం రూ.రెండు కోట్ల వరకూ మాత్రమే ధాన్యం సొమ్ములు జమకావాల్సి ఉంది. అవి జమవుతున్నాయి.

ప్రశ్న : ఇంకా రైతుల వద్ద ఎంతమేర ధాన్యం ఉందని అంచనా వేశారు. అదనంగా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఏమైనా ఇచ్చిందా?

డిఎం : 21 వేల ఎకరాలకు సంబంధించి పంట కుప్పల రూపంలో ఉందని తేలింది. ప్రభుత్వం అదనంగా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతిచ్చింది. రైతులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదు. రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు జరుగుతోంది.

ప్రశ్న : రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశారా?

డిఎం : రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఫిబ్రవరి మొదటి వారంలో దీనికి సంబంధించి సమావేశం జరగనుంది. టార్గెట్, ఏవిధంగా ముందుకు సాగాలన్న నిర్ణయాలు తీసుకోవడం జరుగుతోంది.

ప్రశ్న : ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగిందని భావిస్తున్నారా? ధాన్యం కొనుగోలులో ఏవిధంగా ముందుకు సాగారు?

డిఎం : ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు బాగా జరిగింది. రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు వచ్చింది. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశాలతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడంతో రైతులకు ఏ ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు జరిగింది. ప్రభుత్వం 48 గంటల్లోపే ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాల్లో జమచేయడం రైతుల్లో ఎనలేని సంతోషాన్ని నింపింది.

ప్రశ్న: గతంలో సంచులు, రవాణా, తేమ శాతం వంటి ఇబ్బందులను జిల్లా రైతాంగం ఎదుర్కొంది. ఖరీఫ్‌లో ఆ సమస్యలు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

డిఎం : గతంలో ఏర్పడిన సమస్యలతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారు. ముందుగానే సంచుల ఇబ్బంది లేకుండా చూసుకోవడం, వాహనాలను రిజిస్ట్రేషన్ ముందుగానే జరపడం వంటివి ఇబ్బందులు లేకుండా చేశాయి. అంతేకాకుండా రైసుమిల్లులకు సంబంధించి ర్యాండమైజేషన్ తొలగించి రైతుల నచ్చిన మిల్లుకు ఇచ్చుకునే అవకాశం కల్పించడం ధాన్యం కొనుగోలు సాఫీగా జరగడానికి ఉపయోగపడింది. తొలుత ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో ధాన్యం కొనుగోలు జరిగింది. తర్వాత ఇతర మండలాల్లో ప్రారంభమైంది. దీంతో సంచులు వంటి సమస్యలు లేకుండా సాఫీగా సాగింది.

ప్రశ్న : తుపాన్ల హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అప్పుడు ఏవిధంగా ముందుకు సాగారు?

డిఎం : మూడు సార్లు తుపాను హెచ్చరికలు వచ్చాయి. దీంతో మాసూలు చేసిన ధాన్యం తడవకుండా 2,500 టార్పిన్లు రైతులకు అందించాం. ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేస్తూ ఇబ్బంది లేకుండా చూశాం.

ప్రశ్న : తేమశాతం ఇబ్బంది లేకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

డిఎం: రైతు సేవా కేంద్రాల వద్ద, మిల్లర్ల వద్ద తేమశాతం యంత్రాలను ఒకేరకమైనవి ఏర్పాటు చేశాం. దీంతో రైతులకు తేమశాతం ఇబ్బందులు తలెత్తలేదు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించే పశుఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగినన్ని నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తోందన్నారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చు తగ్గించడానికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణకు జిల్లాలోని 27 మండలాల్లో మండలానికి రెండు టీముల చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో టీములో ఒక పశు వైద్యుడు, ఒక పారా వెటరినరీ సిబ్బంది, పశువైద్య సహాయకులు ఇంకా గోపాలమిత్రులు ఉంటారన్నారు. పశు సంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జెడి టి.గోవిందరాజు మాట్లాడుతూ ఈ పశుఆరోగ్య శిబిరాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించడం, అలాగే లేగదూడలకు, పాడి పశువులకు కూడా నట్టల నివారణ మందులు తాగించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా అనారోగ్యంగా ఉన్న పశువులకు చికిత్స చేస్తామని తెలిపారు. దీంతో పాటు 14 మండలాల్లో లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనకు విచ్చేసిన అన్ని లేగదూడలకూ ఖనిజమిశ్రమ లవణాలు గల ప్యాకెట్లను ఎదుగుదలకు పనికొచ్చే మందులు ఇవ్వడమే కాకుండా, అందాల ప్రదర్శనలో గెలిచిన లేగదూడల రైతులకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. రైతు సోదరులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అత్యవసర పనుల ప్రతిపాదనలు సమర్పించండి

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు :ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపట్టాల్సిన అత్యవసర పనుల అంచనాల ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సర్వజన ఆసుపత్రిని ఆమె ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాతాశిశు సంరక్షణ భవనం ప్రవేశ మార్గం వద్ద వీల్ చైర్స్ సులువుగా వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటుకు, ఆసుపత్రి చుట్టూ ఉన్న డ్రెయిన్ల ద్వారా మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేందుకు అవసరమైన డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు అవసరమైన అంచనాలతో కూడిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, ఆసుపత్రుల ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్లు సమన్వయం చేసుకుని సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తొలిగా అత్యవసర పనుల ప్రాతిపధికగా విడివిడిగా అంచనాల ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎం.రాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, నగరపాలక సంస్థ ఇఇ జి.సురేంద్రబాబు ఉన్నారు.

పబ్లిక్ అని బోర్డు ఉన్న పిహెచ్‌సి

పిహెచ్‌సికి పబ్లిక్ హాలీడే
దర్శనమిచ్చిన బోర్డు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పిహెచ్‌సికి పబ్లిక్ హాలిడే బోర్డు పెట్టారు. మండల కేంద్రమైన వేలేరుపాడు పిహెచ్‌సికి ఆదివారం ఈ బోర్డు కనిపించడంతో కేంద్రానికి వచ్చిన రోగులు విస్తుపోతున్నారు. 24 గంటలూ ప్రజలకు సేవలందించాల్సిన ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు ఈ పబ్లిక్ హాలిడే బోర్డును చూసి ఏం చేయాలో తెలియని స్థితిలో వెనుదిరిగారు. ప్రయివేట్ వైద్యుని వద్దకు వెళ్లి చూపించుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేని పేదలు వైద్యానికి దూరమవుతున్నారు. ప్రాణాపాయ పరిస్థితిలో ఆసుపత్రికి వస్తే పరిస్థితి ఏంటని రోగులు, ప్రజలు వాపోతున్నారు. మారుమూల నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లాలన్నా, ఇటు భద్రాచలం వెళ్లాలన్నా 70, 80 కిలోమీటర్లు ప్రయాణించాలని చెబుతున్నారు. కనీసం ఏదైనా ఎమర్జెన్సీ పరిస్థితి ఏర్పడితే అక్కడ వైద్యం అందించి పెద్ద హాస్పిటల్స్‌కు రిపోర్ట్ చేస్తారు. కాని ఇక్కడ అసలు డాక్టర్లు కాని, స్టాఫ్ నర్సులు కాని లేకపోవడంతో మారుమూల ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి ఏంటని, దీనిపై సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపు దారుణం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంప్లెక్స్ ఎరువుల ధరలు దారుణంగా పెంచి వేయడం దారుణమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు అన్నే భవనంలో పెంచిన ఎరువుల ధరలపై ఆదివారం ఆయన మాట్లాడారు. 10-26-26 కాంప్లెక్స్ ఎరువుల ధర రూ.1470 నుంచి రూ.1720, 12-32-16 ధర రూ.1480 నుంచి రూ.1720, 20-20-13 ధర రూ.1200 నుంచి రూ.1300 పెంచడం వల్ల రైతులపై విపరీతమైన భారం పడుతుందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ముడి సరుకుల ధరలు పెరిగాయని కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచి వేయడం తగదన్నారు. డిఎపికి ఇచ్చిన విధంగానే కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువులకు రాయితీ ఇచ్చి ఎరువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యవసాయ నష్టాలతో ఉన్న అన్నదాతలు పెరిగిన ఎరువుల ధరల వల్ల మరింత నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు నిలిపివేత తగదు

రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కొనుగోళ్లు నిలిపివేయడం తగదన్నారు. టార్గెట్స్ పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా డెల్టా పరిధిలో రబీ పంటకు సాగునీరు అందించకపోవడంతో రైతులు ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వరి కుప్పలు వేసుకుని ఫిబ్రవరి, మార్చి మాసాల్లో కుప్పల నూర్పిడి చేసి ధాన్యం అమ్ముకుంటారని, రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.


మాట్లాడుతున్న నాగశైలజ

సబ్ జైలు సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ జైలును 15వ అదనపు జిల్లా జడ్జి నాగ శైలజ, రెండో అదనపు మేజిస్ట్రేట్ ఎం.శివపార్వతి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డిఎస్‌పి ప్రసాద్, డిప్యూటీ డిహెచ్‌ఎంఒ నరేంద్రకృష్ణ, ఎఎస్‌డబ్ల్యుఒ శ్రీనివాసరావు, డివైఇఒ సేవియా, వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి ఆదివారం సందర్శించారు. ఆరోగ్య సమస్యల గురించి, ఆహారం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని, కుల వివక్ష చూపుతున్నారా అని, అందరికీ న్యాయవాదులు ఉన్నారా అని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

నేరాలు - ఘోరాలు

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మాజీ సర్పంచి హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని సంతోషపురం మాజీ సర్పంచి కాల్వ నల్లయ్య (58) హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం కైకలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. నల్లయ్యను పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బోధనపు శ్రీనివాసరావు హత్య చేశాడని తెలిపారు. ఇనుపరాడ్డు, తన మోటార్ సైకిల్‌లో దాచి ఉంచిన కత్తితో నల్లయ్యపై దాడి చేయడంతో మృతి చెందాడని చెప్పారు. సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో కలిదిండి ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో ఆదివారం సంతోషపురంలో నిందితుడు బోధనపు శ్రీనివాసరావును అతని ఇంటి వద్ద అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన రాడ్డు, కత్తిని స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యక్తిని కొట్టి గాయపరిచిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన గురజాల వెంకటేశ్వరరావు ఈ నెల 17వ తేదీన తన తల్లికి పసుపు కుంకుమగా ఇచ్చిన భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అడ్డుపడ్డారు. దుర్భాషలాడుతూ వెంకటేశ్వరరావు తలపై రాడ్డుతో కొట్టడంతో గాయాలపాలైన వెంకటేశ్వరరావును బంధువులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

జీలుగుమిల్లి : కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1200 నగదు, ఒక కోడిపుంజు, కోడి కత్తిని స్వాధీనం చేసుకుని వారందరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చలిగాలి చంపేస్తోంది..!

జనం గజగజ
రోగాల బారిన పడుతున్న వైనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజలను చలిగాలులు చంపేస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటలు అయ్యేసరికి చలి తీవ్రత ఉగ్రరూపం దాల్చుతోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో చలి తీవ్రతకు జనం గజగజ వణుకుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు రాత్రి సమయంలో చలిని తట్టుకోలేకపోవడం కష్టతరంగా మారింది. ప్రజలు చలిని తట్టుకోలేక అనారోగ్యాల పాలవుతున్నారు. చలి తీవ్రత కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు జలుబు, దగ్గు, జ్వరం బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. తెల్లవారుజామున, పగటి పూట కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. కూలీలు కూడా చలిని తట్టుకోలేక పనులకు ఆలస్యంగా వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణాలు కూడా తగ్గాయి. రాత్రి సమయాల్లో మండలంలోని అన్ని రోడ్లపై జనసంచారం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. చలి తీవ్రతను తట్టుకోవడానికి జనం ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తుల అమ్మకాలు కూడా పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. చలి తీవ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రొంప, జ్వరం, జలుబులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొంతు సంబంధిత వ్యాధులు కూడా ఎక్కువగా సంక్రమిస్తున్నాయని జనం చెబుతున్నారు. చలి తీవ్రత కారణంగా రాత్రి సమయాల్లో వాహనదారుల బయట ప్రయాణాలు తగ్గాయి. ఎంతకాలం చలిగాలులతో ఇబ్బంది పడేదంటూ గ్రామీణ ప్రాంత జనం చెప్పుకుంటున్నారు. మండల ప్రజలు చలి పులితో గజగజ వణికిపోతున్నారు.

సరస్వతికి జాతీయ ప్రతిభా అవార్డు

పలువురి అభినందన

అవార్డు అందుకుంటున్న సరస్వతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ బి.సరస్వతి సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. మూఢనమ్మకాలు, చేతబడులు, ఆడపిల్లలకు చదువే నేరమని భావించే లంబాడి సమాజంలో మారుమూల రేపూడి తండాలో భరోత్ శిక్షా నాయక్, తిరుపతమ్మ దంపతులకు ఐదుగురు సంతానంలో మొదటి సంతానంగా డాక్టర్ భరోత్ సరస్వతి జన్మించారు. తన మాతృభాష లంబాడి. తెలుగు భాష రాని ఆ మారుమూల లంబాడి తండాలలో తన బాల్యంలోనే తెలుగు భాషను బడిబళ్ల నేర్చుకుని ఇంటర్ వరకు చదువు కొనసాగించారు. తరువాత చదివించే స్తోమత లేక తల్లిదండ్రులు చింతలపూడి మండలం రేచర్ల గ్రామవాసి భూక్యాసోమలుకు ఇచ్చి వివాహం జరిపించారు. భర్త భూక్యాసోమలు ప్రోత్సాహంతో 2000 సంవత్సరంలో ఎస్‌జిటి ఉపాధ్యాయురాలిగా ఎంపికై విధులు నిర్వహించుకుంటూనే ఉన్నత విద్యను కొనసాగించి 2009లో స్కూల్ అసిస్టెంట్ తెలుగుగా ఉద్యోగోన్నతి పొందారు. ఆమె బోధించే తెలుగు సబ్జెక్టులో ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థులకు వంద శాతం విజయం రావడం అనేది ఆమె పట్టుదల, విద్యా విధానం మీద నిబద్ధత ప్రతిబింబిస్తుంది. లంబాడి జాతి ఉన్నతికి నిలబెట్టాలనే ఆలోచనతో కృష్ణాజిల్లా లంబాడీల సాంస్కృతిక జీవన విధానం అనే అంశంపై పరిశోధన చేసి నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందింది. 2018లో డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఎంపికైంది. వారు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో, సమావేశాల్లో సుమారు 35కి పైగా పరిశోధన పత్రాలను సమర్పించి గౌరవం పొందారు. ఎంతోమంది గురువుల స్ఫూర్తితో అంచెలంచెలుగా ఎదగడం వారి కృషి ఫలితం. ఈ విధంగా నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అధ్యాపకురాలిగా మారారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

దెందులూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ సరస్వతి సౌత్ రన్ ప్రయివేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డును గుంటూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా బి.సరస్వతికి ఎస్‌టి బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్య నాగేశ్వరరావునాయక్, గుగ్గులోతు కృష్ణనాయక్ ధారావతుకీమియా నాయక్ ధారావతు రాజబాబు నాయక్ అభినందనలు తెలిపారు. డాక్టర్ బి.సరస్వతి గిరిజన లంబాడి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ లంబాడీల సాంస్కృతిక జీవన విధానం అనే అంశంపై పరిశోధన చేసి నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారన్నారు. వీరు అనేక పరిశోధనలు చేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. వీరికి అనేకమంది గిరిజన లంబాడి నాయకులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి వెటర్నరీ డిస్పెన్సరీ పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ సోమవారం నుంచి 31వ తేదీ శుక్రవారం వరకు 12 రోజుల పాటు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి యు.క్రాంతికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పశువైద్య ఆరోగ్య శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ మందులు, సూడి పరీక్షలు, తిరగపోర్లే గేదెలకు చికిత్స, కృత్రిమ గర్భాధారణ, సన్న జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న పాడి రైతులు ఈ పశు వైద్య ఆరోగ్య శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ నెల 20న ముదినేపల్లి, 21న గురజ, 22న పెనుమల్లి, 23న సంకర్షణపురం, 24న పెయ్యేరు, 25న పేరూరు, 26న కోమర్రు, 27న కాకరవాడ, 28న పెదపాలపర్రు, 29న కోడూరు, 30న చినపాలపర్రు, 31న సింగరాయపాలెం గ్రామాల్లో పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా నేటి నుంచి 31 వరకు పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పశువైద్యా సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయిబుచ్చారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా రెండు టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో టీమ్‌లో ఒక పశు వైద్యుడు, పశు వైద్య సహాయకులు ఉంటారన్నారు. పశువులకు సంబంధించి పలు రకాల వ్యాధులకు పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని పశు రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుతూ అనేక చట్టాలను తీసుకురావడంలో, ప్రజా పోరాటంలో, చట్టసభల్లో సిపిఐ పాత్ర గణనీయమైందని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ మహాసభ దంతా తిరుపతయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. వన సంరక్షణ సమితి సభ్యులకు ఒక హెక్టార్ భూమి వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని, రేచర్ల వాటర్ ట్యాంక్ నుంచి కృష్ణుడి ఆలయం వరకు సిమెంట్ రోడ్డు వేయాలని తీర్మానించారు. జమ్మి శ్రీనివాస్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. శాఖ కార్యదర్శిగా ఇస్తరాకులు వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

పోలీసులకు మహిళ ఫిర్యాదు

ఉంగుటూరు : నారాయణపురంలో రాజేష్ అనే వ్యక్తి తనకు ఉద్యోగం ఇప్పిస్తామని ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, కొంత నగదు తీసుకుని మోసం చేసినట్లు అదే గ్రామానికి చెందిన వీరమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసిందని చేబ్రోలు పోలీసులు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని విచారణలో వాస్తవాలు వెల్లడికాల్సి ఉందని పోలీసులు చెప్పారు .

గ్రంథాలయంలో యోగి వేమన జయంతి

ప్రజాశక్తి - భీమడోలు


గ్రంథాలయంలో యోగివేమన జయంతి వేడుకలు

మహాకవి, సంఘసంస్కర్త యోగివేమన రచనల సారాంశం నేటికీ ఆచరణీయమని భీమడోలుకు చెందిన సామాజిక కార్యకర్త మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త సుధాకర్ మాట్లాడుతూ చిన్న చిన్న తెలుగు పదాలను వాడుతూ అందరికీ అర్థమయ్యే రీతిలో రచనలు చేసి సామాన్యుల మన్ననలను సైతం సొంతం చేసుకున్న యోగివేమనను ధన్యజీవిగా అభివర్ణించారు. అనంతరం గ్రంథాలయంలో విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచే క్రమంలో గ్రంథాలయ సంస్థ ఏర్పాటుచేసిన చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు తాము చదివిన పుస్తకాలపై రాసిన సమీక్షలను సామాజిక కార్యకర్త పరిశీలించారు. కొన్ని సవరణలను విద్యార్థులకు సూచించారు. ఇదే కార్యక్రమం కొనసాగితే విద్యార్థులు రానున్న కాలంలో ఉత్తమ పాఠకులుగా తయారయ్యే అవకాశం ఉందని తెలిపారు.

నేడు భీమడోలు మండల సమావేశం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20వ తేదీన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. సమావేశానికి ఎంపిపి కె.రామయ్య(ఆదాం) అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశానికి హాజరు కాని మండల అధికారులపై తగు చర్యలు తీసుకునే నిమిత్తం జిల్లా స్థాయి అధికారులకు సమావేశం సిఫార్సు చేస్తుందన్నారు. ఇదే క్రమంలో సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయి వివరాలతో కూడిన నివేదికను సమావేశానికి ముందు సమర్పించాలని కోరారు.

21 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆయా గ్రామాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు వేదికగా క్యాంపులను నిర్వహిస్తామని ఎంపిడిఒ తెలిపారు. ఈ విషయమై విస్తృతస్థాయి ప్రచారం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు నిర్వహణలో భాగంగా గుండుగొలను క్యాంప్ యూనిట్ ఆధ్వర్యంలో 21, 22 తేదీల్లో ఆగడాలలంక, 23, 24 తేదీల్లో చెట్టున్నపాడు గ్రామంలో క్యాంపులు ఉంటాయన్నారు. పూళ్ల క్యాంపు యూనిట్ ఆధ్వర్యంలో 21 ,22 తేదీల్లో పూళ్ల, 23, 24 తేదీల్లో కురెళ్లగూడెం గ్రామంలో క్యాంపులు ఉంటాయన్నారు. భీమడోలు క్యాంపు యూనిట్ ఆధ్వర్యంలో 21 ,22 తేదీల్లో భీమడోలు, 23, 24 తేదీల్లో సూరప్పగూడెం గ్రామాల్లో క్యాంపులను నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపుల్లో ఆధార్ కార్డుల నమోదు, కార్డుల్లో నవీకరణ కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు.

బహ్రైన్‌లో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అరబ్ దేశమైన బహ్రైన్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు వర్ధంతి వేడుకలను భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున నిర్వహించారు. తెలుగుదేశం, ఎన్‌టిఆర్ అభిమానులు ఎక్కువగా ఉండే బహ్రైన్‌లో వర్ధంతి వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని బహ్రైన్ టిడిటి అధ్యక్షుడు రఘునాథబాబు, రామ్మోహన్‌రావు, చంద్రబాబు, వెంకట్, సతీష్‌శెట్టి, భాస్కర్, శ్రీరామ్, చిలుకూరి మౌళి, వంశీ, పుల్లారావు తదితరులు అన్నారు. తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మహనీయుడు నందమూరి తారకరామారావు అని కొనియాడారు.

మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టీమ్‌లు ఆహ్వానం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో జరగనున్న మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టీమ్‌లను ఆహ్వానిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్ కె.విజయ్ ఆదివారం తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో బొర్రంపాలెంలో మెయిన్ రోడ్డు పక్కన సూరిబాబు స్థలంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.ఐదు వేలు అందిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే టీమ్‌లు ఈ నెల 26 లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9676669597 సంప్రదించాలని తెలిపారు.

పనిచేయని చేతిపంపులు.. తాగునీటి వెతలు..!

ప్రజాశక్తి - కుక్కునూరు

పనిచేయని చేతిపంపు

మండలంలోని పలు గ్రామాల్లో చేతి పంపులు నిరుపయోగంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి పలు చేతి పంపులు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో గ్రామాల్లో నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులు చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తే కొంతవరకు నీటి సమస్యను అధిగమించవచ్చు. కాని అధికారులు ఆ దిశగా పనిచేయడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. తీవ్ర నీటి సంక్షోభం మధ్య గ్రామాల్లో ఎండిపోయిన బోర్లు, బావులు, చెరువులు దర్శనమిస్తున్నాయి. ప్రజలు తీవ్ర తాగునీటి కొరత ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు క్షీణించడం, సరైన వర్షపాతం లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. నివాసితులు తాగునీటి అవసరాల కోసం శుద్ధమైన నీటిని కూడా పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల మెరుగుదలకు కేటాయించిన నిధుల వినియోగంపై అక్రమార్జన ఆరోపణలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. వేసవి కాలం వస్తే దాని ప్రభావంతో నీటి కొరత తీవ్రత మాదకరస్థాయికి చేరుకుంటుంది. ప్రాథమిక నీటి వనరుగా చేతిపంపులపై ఆధార పడే నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతి పంపులు శిథిలావస్థలో ఉండడంతో తాగునీటి కొరత ఏర్పడుతుంది. గ్రామస్తులకు వారి ప్రాథమిక అవసరాలను తీర్చడం మరింత సవాలుగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండే నీటి వనరులను అందించటంలో చేతిపంపుల ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఈ కీలకమైన మౌలిక సదుపాయాలకు మరమ్మతులు చేయటంలో చాలా నిర్లక్ష్యం కనిపిస్తోంది. మరమ్మతులకు నోచుకోని చేతి పంపులు ప్రజల రోజువారి కష్టాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. పట్టణ, గ్రామీణ నివాసితుల జీవితాలు ప్రభావితం అవుతున్నాయి. తాగటం, వంట చేయటం వ్యక్తిగత పరిశుభ్రతతో సహా రోజువారి ఫంక్షన్‌లకు చేతిపంపులు లేకపోవడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఎందుకంటే కుటుంబాలు ప్రత్యామ్నాయ నీటి వనరుల కోసం వెతకటానికి లేదా అధిక ధరలకు నీటిని కొనుగోలు చేయడానికి విలువైన సమయాన్ని, వనరులను హెచ్చించాల్సి వస్తుంది. నీటి అవసరాల కోసం చేతిపంపులపై ఎక్కువగా ఆధారపడినవారికి పరిమితమైన లేదా స్వచ్ఛమైన నీరు దొరకడంలేదు. నీరు అత్యవసరమైన వనరు అయినందున ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు, సంబంధిత వాటాదారులు తక్షణమే చేతిపంపుల మరమ్మతులకు, నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

బోడిగూడెంలో పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని బోడిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు డిప్యూటీ తహశీల్దార్ కంభంపాటి శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షులుగా తామా బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా పాయం సోమశేఖర్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొక్కిర వెంకటలక్ష్మి, సున్నం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, నూజివీడు డివిజన్, ఏలూరు జిల్లాలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి ఈ నెల పదో తేదీన ప్రకటన ఇచ్చారు. ఈ నెల 19వ తేదీ దరఖాస్తు స్వీకరణ తుది గడువుగా పేర్కొన్నారు. దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగించారు. ఆసక్తి ఉండి అర్హత కలిగిన అభ్యర్థులు సబ్ కలెక్టర్, నూజివీడు, సంబంధిత (6) మండల తహశీల్దార్ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు.

ట్యాక్సీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన ట్యాక్సీ డ్రైవర్ దారం రాము కుటుంబానికి గోదావరి ట్యాక్సీ యూనియన్ సభ్యులు రూ.25 వేల ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు అనిశెట్టి పరమేశ్వరరావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారిని త్వరగా నిర్మించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో చేపట్టిన ప్రధాన రహదారి నిర్మాణ పనుల సాగతీతపై సిపిఐ కుక్కునూరు సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళనకు దిగారు. మండలంలోని పెదరావిగూడెం ప్రధాన రహదారిపై ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడారు. గత మూడు నెలల క్రితం రహదారి నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయకుండా గాలికొదిలేశారన్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు రోడ్డుపై వాహనాలు వెళుంటే వచ్చే దుమ్ము, ధూళితో పలువురు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. రోడ్డు పక్కన ఉన్న పంటపొలాలు దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రహదారిపై కంకర పైకి లేచి వాహనదారులపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. తక్షణమే కాంట్రాక్టర్, అధికారులు దృష్టి పెట్టి రోడ్డు పనులు పూర్తి చేసి ప్రమాదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని వెంకటాచారి డిమాండ్ చేశారు. ఆందోళనలో మండల కార్యదర్శివర్గ సభ్యులు మడిపల్లి రమణయ్య, జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబూరావు, పళ్లాల భిక్షం, సోడే నాగేష్, మారయ్య, కనిత రాము, యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

పాలడుగు వెంకట్రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలడుగు వెంకట్రావు పదో వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పరిమి సాగరకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరీదు కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం, ఆశయ సాధన కోసం జీవిత కాలం కృషి చేసిన వ్యక్తి పాలడుగు వెంకట్రావు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిడి రవికుమార్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ వారికి తొత్తులుగా వ్యవహరించిన వారు నేడు దేశభక్తి గురించి మాట్లాడుతూ దేశభక్తులుగా చలామణి కావడం భారతదేశ దురదృష్టకరమన్నారు. నేటి అధికార పార్టీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా దేశానికి ఎంతో ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ పాలడుగు నాగవరత్, ముసునూరు, నూజివీడు టౌన్, నూజివీడు రూరల్ మండలాధ్యక్షులు సూర్యదేవర ప్రసాద, యార్లగడ్డ ఆంజనేయులు, పల్లె పాము ప్రసాద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రాము, ప్రసాదరావు, టిడిపి నాయకులు అక్కినేని చందు, పిసిసి మాజీ సభ్యులు టిఆర్‌బి.విటల్ కుమార్, నూజివీడు టౌన్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూరచంద్రరావు ఆచార్యులు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొందిలి రామ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి
కడియాల సత్యనారాయణ చౌదరి, S/o వెంకటేశ్వరరావు, పెదకడిమి గ్రామం అను నేను సర్వే నంబర్ - 880/2B, 903/3, 620/2 (కొప్పాక రెవెన్యూ పరిధి) గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ పెదకడిమి నుండి పెదవేగి మండలం రెవెన్యూ కార్యాలయానికి వెళ్ళు దారిలో పడిపోయినవి. కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ అడ్రస్‌కు తెలియజేయగలరు.
కడియాల సత్యనారాయణ చౌదరి
S/o వెంకటేశ్వరరావు
పెదకడిమి గ్రామం,
పెదవేగి మండలం, ఏలూరు జిల్లా
సెల్ : 95731 99789